విశాలాంధ్ర విజయనగరం

పేజి నెం. 8

శుక్రవారం 10, అక్టోబర్ 2025

ధాన్యం సేకరణకు అవసరమయ్యే ఏర్పాట్లు వెంటనే చేయాలి

ఈ ఖరీఫ్ లక్ష్యం 4.5 లక్షల మెట్రిక్ టన్నులు

30 లోగా బ్యాంకు గ్యారంటీ లు పూర్తి కావాలి

తేమ యంత్రాలు, గోనె సంచులు సిద్ధం చేసుకోవాలి

కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర -విజయనగరం: ఈ ఖరీఫ్ కు గానూ 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని, పంట కొనుగోళ్ళకు అవసరమగు ఏర్పాట్ల తో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి సేకరణ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరం లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి, గ్రామ స్థాయి కమిటీలను కూడా వెంటనే ఏర్పాటు చేయాలనీ సూచించారు. వ్యవసాయ శాఖ వారు పంట వెరైటీ, దిగుబడి వచ్చే సమయం, సేకరణ పై మండల స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది కి శిక్షణ లు పూర్తి చేయాలనీ, మద్దతు ధర , ట్రక్ షీట్ విధానం, తదితర అంశాల పై విస్తృతంగా ప్రచారం గావించాలన్నారు. ఆర్.ఎస్.కే లతో మాపింగ్, రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలనీ తెలిపారు. పౌర సరఫరాల అధికారి మిల్లులను ట్యాగ్ చేయడం, బ్యాంకు గ్యారంటీ లను తీసుకోవడం, అన్ని మిల్లుల పని చేస్తున్నదీ లేనిదీ తనిఖీ చేయడం, సి.ఎస్.డి.టి లకు శిక్షణ పూర్తి చేయడం వంటి కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. సేకరణకు అవసరమగు మెటీరియల్ ను సరఫరా చేయడం, చెక్ పోస్టు లను ఏర్పాటు చేయడం, వర్షాలు పడితే టార్పాలిన్ సరఫరా చేయడానికి మండల కెంద్రాల్లో సిద్ధం చేయాలనీ మార్కెటింగ్ ఏ.డికు సూచించారు. ప్రాధమిక సహకార సంఘాల ద్వారా కొనుగోళ్ళు చేయడానికి 57 సొసైటీలు సిద్ధంగా ఉన్నాయని, వారికీ శిక్షణ పూర్తిచేసుకోవాలని తెలిపారు. వాహనాలకు జి.పి.ఎస్ ఏర్పాటు చేయడం, తూకపు యంత్రాలను ఏర్పాటు చేయడం, హమలీలను గుర్తించడం ఆయా శాఖలు వెంటనే చేయాలన్నారు. మిల్లర్ల నుండి, రైతుల నుండి చిరగని గోనె సంచులను సేకరించడం, గిడ్డంగులను సిద్ధం చేయడం వంటి పనుల పై కూడా దృష్టి పెట్టాలని, ధాన్యం సేకరణకు అవసరమగు షెడ్యూల్ వేసుకొని, అన్ని పనులను అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలనీ సూచించారు. సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ మాట్లాడుతూ గత ఏడాది సేకరణ లో తలెత్తిన సమస్యల పై వివరించారు. గత ఏడాది జిల్లాలో 159 మిల్లులు పని చేసాయని, ఈ ఏడాది 158 మాత్రమే పని చేస్తున్నాయని తెలిపారు. ఆర్.ఎస్.కే లను వాటి పరిధి లో వచ్చే పంటను బట్టి ఏ,బి,సి లు గా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశం లో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ బొడ్డేపల్లి శాంతి, ఆర్.డి.ఓ లు కీర్తి, రాం మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి భారతి, జిల్లా సహకార అధ్దికారి రమేష్, ఏ.డి మార్కెటింగ్ రవి కిరణ్ , మిల్లర్ల , రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించాలి

-జిందాల్ నిర్వాసితులు

- కొనసాగుతున్న రిలే దీక్షలు

- 111వ రోజుకు చేరిన నిరసనలు

విశాలాంధ్ర -శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితుల నిరసన కార్యక్రమం 111వ రోజు కొన సాగుతుంది. మండలంలోని బొడ్డవరలో గురువారం నిర్వాసితులు మాట్లాడుతూ తాము గతంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత అయిన వై.యస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పరిశ్రమలు వస్తాయి, ఈ ప్రాంతంలో అభివృద్ధి జరుగుతంది, ఉద్యోగాలు వస్తాయి అంటే తమ భూములు ఇచ్చామన్నారు. నేటికి 18 సంవత్సరాలు అయినా కంపెనీ కట్టకుండా, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా జిందాల్ యాజమాన్యం తమని మోసం చేసింది అని అన్నారు. భూములు నాటి నుండి తమ ఆధీనం లోనే ఉన్నాయని, తాము సాగుచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని అన్నారు. జిందాల్ యాజమాన్యం కంపెనీ కట్టకుండా 2023 లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఎంఎస్ఎంఇ పార్క్ ల కి జి.ఓ తీసుకొచ్చారు అని అని అన్నారు. జిందాల్ యాజమాన్యం అప్పటికే ఉద్యోగాలు ఇస్తాం, కంపెనీ లో వాటాలు ఇస్తాం అని మోసం చేయడంతో ,ఇంకో మోసానికి తలపెడుతున్న జిందాల్ యాజమాన్యం కి వ్యతిరేకంగా తాము నిరసన తెలియజేశామని అన్నారు. 2023లో జి.ఓ నంబర్ 14 తీసుకువచ్చి ఇక్కడ ఎంఎస్ఎంఇ పార్క్ ల పేరుతొ రియల్ ఎస్టేట్ వ్యాపారాలకి ఒడిగట్టి తమ భూములను తెగనమ్మే ప్రయత్నం చేస్తున్నారు అని మండిపడ్డారు. అయితే 2023 లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంఎస్ఎంఇ పార్క్ ల కి భూమి పూజ చేద్దాం అని తలపెడితే , రైతులు అందరూ కలిసి నిరసన తెలియజేయగా, జిల్లా పెద్దలు ,నియోజక వర్గ పెద్దలు సమస్యను మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ద్రుష్టి లో పెట్టగా , రైతుల సమస్యల ను ,వాస్తవ పరిస్తితుల ను తెలుసుకుని రైతుల మొర ఆలకించిన జగన్మోహన్ రెడ్డి భూమి పూజ ఆపడం జరిగింది అని తెలిపారు. నేడు తాము వ్యవసాయం చేసు కుంటున్న అదే భూముల్లో దౌర్జన్యంగా ప్రవేశించడం అన్యాయం అని అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆలోచనలను కొనసాగిస్తూ, రైతుల పట్ల ఆయన చూపిన నిబద్ధతను కొనసాగిస్తూ,2023 లో రైతుల పట్ల కరుణ చూపిన జగన్ నేడు కూడా తమకు అండగా నిలవాలి అని కోరారు. మీ పార్టీ పెద్దలు,ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు తమ పక్షాన నిలిచి తమ సమస్యలను ప్రభుత్వం దాకా తీసుకెళ్లాలి అని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కోరారు.

మద్యం కోసం కన్న తండ్రినే హత్య చేసిన కసాయి

విశాలాంధ్ర -బాడంగి: మండల కేంద్రమైన బాడంగి లో మద్యం కోసం కన్న తండ్రిని హత్యచేసిన తనయుడు సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై తారకేశ్వర రావు తెలియజేసిన వివరాల ప్రకారం స్థానికంగా చెప్పులు కుట్టుకుని జీవిస్తున్న రాజేశ్వ రరావు సినిమా కాలనీలో నివసిస్తున్నాడు. ఆయన కుమారుడైన లక్ష్మణ్ మద్యం కోసం తండ్రిని డబ్బులు అడగగా నిరాకరించాడనే కోపంతో తెల్లవారుజాము 4 గంటలకు ఇనప రాడ్డుతో కొట్టి చంపినట్లు ఆయన తెలిపారు. మృతుడు భార్య ఉమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సంఘటన స్థలానికి బొబ్బిలి రూరల్ సీఐ నారాయణ రావు వచ్చి పరిశీలించారు. అదేవిధంగా క్యూస్ టీం వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారం సేకరించారు. మృతుడుకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. రెండేళ్ల కిందట పెద్ద కుమారుడు చనిపోగా ఇప్పుడు రెండవ కుమారుడు చేతుల్లోనే తండ్రి హత్య కు గురయ్యాడు.

లైసెన్సులు లేకుండా వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తే కఠిన చర్యలు

లైసెన్సులు లేకుండా వాటర్‌ప్లాంట్లు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎస్.కోట పట్టణంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర -శృంగవరపుకోట: కానరాని ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు ఎక్కడ అంటూ విశాలాంధ్రలో వచ్చిన కథనానికి స్పందనగా, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి నాగుర్ మీరా స్పందించారు.గురువారం శృంగవరపుకోట పట్టణంలో తనిఖీల దాడులు చేపట్టారు. పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్లు, వంట నూనె దుకాణాలు, ఫుడ్ సెంటర్లను పరిశీలించారు. అనధికారంగా నడుస్తున్న కొన్ని వాటర్ ప్లాంట్లను సీజ్ చేసి, సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీనారాయణ ట్రేడర్స్ ఆయిల్ షాపులో నుంచి నూనె శాంపిల్స్ సేకరించి నాచారం ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించినట్లు తెలిపారు.అదే విధంగా ఎఫ్ఎస్ఎస్ఏ లైసెన్సు లేకుండా నడుస్తున్న వాటర్ ప్లాంట్లపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.అంతేకాక, ఎస్.కోట సబ్ జైలులో ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కందిపప్పు మార్పు సూచన చేశారు. "ఆయిల్ ట్యాంకర్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని. లైసెన్సులు గడువు ముగియకముందే రీన్యువల్ చేసుకోవాలని. కల్తీ నూనె విక్రయిస్తే ఎవరైనా సరే కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. "ఎఫ్ఎస్ఎస్ఏ లైసెన్సు ఉంటే కల్తీ చేయొచ్చా? లైసెన్సు ఉంటే చట్టం వర్తించదా?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజలు స్పష్టమైన చర్యలు కోరుతున్నారు. "తనిఖీలు ఒకరోజు ఆగిపోవద్దు, నిరంతరం కొనసాగించాలి. లైసెన్సు ఉన్నా, లేకపోయినా నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి" అని వినిపిస్తున్న స్వరాలు చెబుతున్నాయి. ఫుడ్ సేఫ్టీ విభాగం పునరుద్ధరించిన ఈ చర్యలు ప్రజల ఆశలు రేకెత్తించాయి. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థినుల ఎంపిక

విశాలాంధ్ర-రాజాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) విద్యార్థినులు ప్రతిభా ప్రదర్శనతో మరోసారి గర్వకారణంగా నిలిచారు. శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో వాలీబాల్ విభాగంలో టి. సూర్యకుమారి, ఎ. నిరోషి, వై. గౌతమి, వై. జయశ్రీ, బి. వెంకటలక్ష్మి, సి.హెచ్. పవిత్ర, కబడ్డీ విభాగంలో యస్. యశోని, అలాగే స్విమ్మింగ్ అండర్-19 విభాగంలో వై. కల్పన అర్హత సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం కళాశాల గర్వకారణమైంది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. జనార్ధన విద్యార్థినులను అభినందిస్తూ,మా విద్యార్థినులు క్రీడా రంగంలో చూపిన ప్రతిభ సమాజానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గర్వకారణం. రాష్ట్ర స్థాయిలోనూ ఇదే ప్రతిభ కనబరిచి ఉన్నత ఫలితాలను సాధించాలని మా ఆశీర్వాదాలు అని అన్నారు.కళాశాల ప్రాంగణంలో జరిగిన అభినందన సభలో పి.ఎస్.యన్. గుప్తా, ప్రసన్న కుమార్, అనిల్‌తో పాటు అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులను ఘనంగా సత్కరించారు. స్థానికులు, తల్లిదండ్రులు కూడా ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తూ, విద్యార్థినులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు.

14న తెప్పోత్సవానికి అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం...

విశాలాంధ్ర-విజయనగరం: ఈనెల 14వ తేదీన మంగళవారం నిర్వహించనున్న తెప్పోత్సవానికి అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నామని విజయనగర నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఈ మేరకు ఆయన ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, సిబ్బంది గురువారం వనం గుడి ప్రాంతంలో ఉన్న గాడీకాన సమీపంలో ఉన్న పెద్ద చెరువు గట్టు పరిసర ప్రాంతాల్ని శుభ్రపరచే కార్యక్రమాలను చేపట్టారు. ముఖ్యంగా తెప్పోత్సవానికి ప్రారంభ వేదికగా ఉన్న గట్టు ఇతర ప్రాంతాలలో చెత్తాచెదరాలను తొలగించి వేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పైడితల్లమ్మ సిరిమానులో జాతర మహోత్సవంలో ప్రజారోగ్య సిబ్బంది విశిష్ట సేవలను అందించారని అన్నారు. అదేవిధంగా తెప్పోత్సవానికి అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించి ప్రజా మన్ననలను పొందాలని అన్నారు. జాతరలు, ఉత్సవాల సమయంలో ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన అంశమని అన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు పొందిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ను అభినందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బొబ్బిలి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా విజయవాడలో ఈనెల 6న స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు ప్రధానం చేశారు. స్వచ్ఛత కార్యక్రమాలలో అద్భుత ప్రతిభ కనబరిచిన మున్సిపాలిటీలకు, పంచాయితీలకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు ఇవ్వగా, బొబ్బిలి పట్టణం స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డుకి ఎంపికైనది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ అవార్డును మున్సిపల్ చైర్మన్ రాంబర్కి శరత్ బాబు, మున్సిపల్ కమీషనర్ లాలం.రామలక్ష్మి అందుకున్నారు. ఈ సందర్భంగా బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు(బేబీ నాయన) ని చైర్మన్ మరియు కమీషనర్ మర్యాదపూర్వకంగా కలువగా, ఎమ్మెల్యే బేబి నాయన, చైర్మన్ శరత్ బాబు ని, కమీషనర్ లాలం రామలక్ష్మి ని సిబ్బందిని అభినందించారు.

పంట కోత ప్రయోగాలపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర -విజయనగరం/ జామి: పంట కోత ప్రయోగాలు మీద రెవెన్యూ, వ్యవసాయ శేఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జామి రైతు సేవా కేంద్రం లో గురువారం నిర్వహించారు. వ్యవసాయ అధికారి ఎం. పూర్ణిమ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకం కింద పంటభీమా అమలుచేయడానికి పంట కోత ప్రయోగాలు ప్రధాన కొలమానం గా ఉంటాయని తెలిపారు. ఎటువంటి తప్పిదాలు లేకుండా కచ్చితంగా ప్రణాళికబద్ధంగా చేయాలని సూచించారు.. ఇపంట నమోదులో ప్రతీ ల్యాండ్ పార్సెల్ శత శాతం కవర్ చేయాలని ఆదేశించడం జరిగింది. ప్రతీ రైతు తమ భూమి వివరాలు, ఆధార్, ఫోన్ నెంబర్ లు మీ గ్రామ వ్యవసాయ సహాయకులు ఇవ్వాలి ఇ పంట లో నమోదు చేయించుకోవాలి అని తెలియపరచడమైనది. అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి పంట కోత ప్రయోగాలు చేసే పద్ధతి గురించి వివరించడం జరిగింది. ఈకార్యక్రమంలో వ్యవసాయ శేఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఇన్సూరెన్స్ వారు పాల్గొవడం జరిగింది.

శ్రీ పైడితల్లి ఆలయ పునర్‌నిర్మాణ పనులు ప్రారంభం

రూ.కోటి, 80 లక్షలతో ఆలయ అభివృద్ధి

శంకుస్థాపన చేసిన ఆలయ ధర్మకర్త, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర ఇలవేలుపు శ్రీ పైడి తల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. సుమారు రూ. కోటి, 80 లక్షల సిడిఎఫ్ నిధులతో చేపట్టనున్న పునర్ నిర్మాణ పనులకు, మాన్సాస్ ఛైర్మన్, ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ శ్రీ పూసపాటి అశోక్‌గజపతిరాజు గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన సతీసమేతంగా హాజరై, శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ అధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులనాయుడు, విజయనగరం ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఆలయ ఈఓ కె.శిరీష, ఇతర అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు, పలువురు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రముఖులంతా అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ఏడాదిలో పనులు పూర్తిచేస్తాం : గవర్నర్ అశోక్

పైడితల్లి అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణ పనులను ఏడాదిలోపల పూర్తి చేస్తామని ధర్మకర్త శ్రీ పూసపాటి అశోక్‌గజపతిరాజు చెప్పారు. వచ్చే ఏడాది పండుగ నాటికి భక్తులకు ఇబ్బందులు తొలగిపోతాయని, వారు సంతోషించేలా పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. తమతోపాటు ఇటీవలే ఏర్పాటైన ఆలయ కమిటీ కూడా ఈ పనులను పర్యవేక్షించి, సకాలంలో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నది ఎప్పటినుంచో తమకు ఉన్న ఆశయమని, అది ఇన్నాళ్లకు నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. అభివృద్ధి పనులను ప్రారంభించడం తమ అదృష్టంగా పేర్కొన్నారు. మన రాజ్యాంగం, చట్టం ప్రకారం అభివృద్ధి పనులు పారదర్శకతతో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పైడితల్లి అమ్మవారి కీర్తిని, ప్రతిష్టను మరింత పెంచేందుకు తమవంతు కృషి చేస్తామని ఆయన అన్నారు. అశోక్‌గజపతి కుమార్తె, విజయనగరం ఎంఎల్ఏ అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ చట్టప్రకారం ఆలయం చుట్టూ భూసేకరణ పూర్తయ్యిందని అన్నారు. దీంతో ఆలయ పునర్ నిర్మాణ పనులకు అవకాశం కలిగిందని, పనులను వేగంగా నిర్వహించి, ఏడాది లోపలే పూర్తి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. త్వరలోనే భక్తుల ఇబ్బందులు తొలగిపోనున్నాయని, ఆలయ విస్తరణ వల్ల అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని ఆమె చెప్పారు.

అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

- అనధికార తయారీదార్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలి

- విక్రయదారులు అన్ని రకాల భద్రతాచర్యలను పాటించాలి

- కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర -విజయనగరం: అనుమతి లేకుండా బాణాసంచాను విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. గ్రామస్థాయిలో సైతం తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లాలో నిర్వహిస్తున్న బాణా సంచా విక్రయాలు, తయారీపై పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లలో మొత్తం ముగ్గురు తయారీ దారులు ఉన్నారని, 15 మంది హెూల్‌సేల్ విక్రయదారులు ఉన్నారని డిఆర్ఓ శ్రీనివాసమూర్తి వివరించారు. ఆర్‌డిఓలు డి.కీర్తి, మోహనరావు, ఆశయ్య మాట్లాడుతూ తమ డివిజన్ల పరిధిలో బాణాసంచా విక్రయాల గురించి వివరించారు. కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, బాణాసంచాను ఏ స్థాయిలో విక్రయించినా అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. హెూల్‌సేల్ షాపులను పోలీస్, ఫైర్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేయాలన్నారు. గ్రామాల్లో జరిపే విక్రయాలను విఆర్‌ఓలు తనిఖీ చేయాలని ఆదేశించారు. విక్రయాల కోసం అనుమతి పొందినవారు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని అన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని, నీరు అందుబాటులో ఉంచాలని, ఫైర్ సిలండర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. తాత్కాలిక విక్రయాలకు అనుమతిచ్చే చోట షాపులమధ్య ఫైర్ ఇంజన్ వెళ్లేందుకు వీలుగా ఖాళీలు ఉంచాలని చెప్పారు. షెడ్లను టెంట్లకు బదులుగా రేకులతోనే నిర్మించాలని సూచించారు. విక్రయదారులతో సమావేశాలను ఏర్పాటు చేసి, వారికి నిబంధనలను వివరించాలని ఆర్‌డిఓలను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అగ్నిమాపక అధికారి రాంప్రసాద్, డిఎస్‌పి వీర్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తాహసీల్దార్లు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలకు శిక్షణ

విశాలాంధ్ర-దత్తిరాజేరు: దత్తిరాజేరు రైతు సేవాకేంద్రంలో గురు వారం మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామ రెవిన్యూ అధికారులకు ఏఎస్ఓ జగన్ శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పంట కాలంలో ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకం ద్వారా ఇన్సూరెన్స్ పథకం అమలు చేయుటకు ప్రధానమైన పద్ధతి, ఈ పంట కోత ప్రయోగాలు ఏవిధంగా చేయాలనే విషయంపై శిక్షణ ఇవ్వడం జరిగిందని వీటిలో ఎటువంటి తప్పిదాలు లేకుండా పంట కోత ప్రయోగాలు చేసి దిగుబడిని అంచనా వేయడంలో ప్రధాన పాత్ర వహించాలని కోరారు. దీనివలన సాగు చేసే భూమి విస్తీర్ణం దిగుబడి తెలుస్తుందని అన్నారు. అదేవిధంగా ఈ ఖరీఫ్ పంటకాలానికి సంబంధించిన పంట నమోదు కార్యక్రమం కూడా ప్రతి ల్యాండ్ పార్సిల్ కవర్ చేస్తూ వంద శాతం పంట నమోదు పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్సూరెన్స్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ గోపిరాజు, వీఆర్వోలు,విఏఏలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-భోగాపురం : పొల్లిపల్లి 11 కేవీ రూరల్ ఫీడర్‌పై విద్యుత్ లైన్లకు చెట్ల కొట్టివేత పనులు చేపడుతున్నామని విద్యుత్ శాఖ కార్య నిర్వాహక ఇంజనీరు జి.సురేష్‌బాబు తెలిపారు.ఈ కారణంగా పొల్లిపల్లి, రాజపులోవ, మహారాజుపేట, కొత్త చెరుకుపల్లి, పాత చెరుకుపల్లి, భూమాత లేఔట్ గ్రామాలకు నేడు 9 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతుందని, ప్రజలు ఈ సమయంలో సహకరించాలని కోరారు.

అండర్-14, 17 బాక్సింగ్, తైక్వాండో పోటీలకు విజయనగరం జిల్లా జట్లు ప్రయాణం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: ఈనెల 10 నుండి 12 వరకు పశ్చిమగోదావరి జిల్లా రాజమండ్రిలో జరగనున్న అండర్-14, అండర్-17 రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో పాల్గొనడానికి విజయనగరం జిల్లా బాక్సింగ్ జట్లు గురువారం బయలుదేరి వెళ్లాయి. అదేవిధంగా, అదే తేదీల్లో బాపట్ల జిల్లా రేపల్లెలో నిర్వహించబడనున్న అండర్-14 తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలకు విజయనగరం జిల్లా తైక్వాండో జట్లు కూడా బయలుదేరాయి. ఈ సందర్భంగా జిల్లా క్రీడా అధికారులు శ్రీరాములు మాట్లాడుతూ, విజయనగరం జిల్లా నుంచి ప్రతిభావంతులైన యువ క్రీడాకారులు రాష్ట్రస్థాయి వేదికపై మెరుగైన ప్రదర్శన చూపి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జల జీవన్ మిషన్ పనుల పరిశీలన

విశాలాంధ్ర-గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో రూ.1.24 కోట్ల వ్యయంతో చేపట్టిన జల జీవన్ మిషన్ పనులను జిల్లా అధికారి బృందం గురువారం పరిశీలించారు. ఎన్‌జెజెఎం టీమ్ ఎంపికచేసిన స్కీమ్స్‌పై నిర్వహించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. జడ్పీ సీఈఓ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ ఈ కవిత, డిపిఓ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో బిసి కాలనీ స్కూల్ వీధి లోని కొళాయలను పరిశీలించారు. నీటిలో Residual Chlorine తగిన మోతాదులో ఉందో లేదో పరీక్షించడం జరిగింది. ఈ పరిశీలనలో డీఈఈ శ్రీలత, ఎంపీడీవో రవికుమార్, ఏఈ సత్యం ,సర్పంచ కెళ్ళ లక్ష్మి,వార్డు నంబర్ కెళ్ళ సురేష్, పంచాయతి కార్యదర్శి రామకృష్ణ ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోడకూలి మహిళ మృతి

మరో ఇరువురు కూలీలకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం యాదవ వీధిలో నిర్మాణంలో ఉన్న గోడ కూలిపోయిన సంఘటనలో అదే వీధికి చెందిన చెందిన తోనంగి అప్పయ్యమ్మ(54) బాడింగి మండలం పిన పెంకి గ్రామానికి చెందినపిల్లా రామలక్ష్మి,పిరిడి గ్రామానికి చెందిన రామి నాయుడులకు తీవ్ర గాయాల య్యాయి. ప్రమాద సంఘటనపై పట్టణ సిఐ సతీష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. గాయపడిన ఇరువురు కూలీలను మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య ం అందిస్తున్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

వైసీపీ హయాంలో దళితుల హక్కులు కాలరాశారు : ఎమ్మెల్యే కోండ్రు

విశాలాంధ్ర-రాజాం: చిత్తూరు జిల్లా దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ నేతలు నిప్పు పెట్టి దళితులను అవమానించారని మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మండిపడ్డారు. విజయనగరం బాలాజీ జంక్షన్‌లో ఎమ్మెల్యే అదితి గజపతి రాజుతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు.ఈ దుశ్చర్యలో వైసీపీ నేతల ప్రమేయం సీసీ కెమెరాలు, ఫోన్ రికార్డులతో బట్టబయలైందని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దళితులపై 56 వేల దాడులు, 192 హత్యలు జరిగాయని గుర్తుచేశారు. "అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దళితుల గౌరవాన్ని త్రొక్కడమే. రాష్ట్ర ప్రజలు వైసీపీ కుట్రలకు అప్రమత్తంగా ఉండాలి" అని పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-బొబ్బిలి : నియోజకవర్గ ఎమ్మెల్యే బేబినాయన ఆదేశాలతో మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు పలు వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా టిడిపి పార్టీ పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, 14వ వార్డు పెద్దలు మున్సిపల్ చైర్మన్ శరత్ బాబుకు దుశ్శాలువతో సత్కరించారు. 14వ వార్డు సింగారపు వీధి ఆర్చి నుండి శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ వరకు సిసీ డ్రైన్, గట్లు నిర్మాణం చేయుటకు, అంచనా వ్యయం 12 లక్షలతో శంఖుస్థాపన చేశారు. పట్టణ అభివృద్ధికి శంఖుస్థాపన చేసిన పనిని వేగంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు

విశాలాంధ్ర-విజయనగరం/జామి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలవారి తనిఖీలకు వస్తున్న గర్భిణీలకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం ఆనందంగా ఉందని ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు, స్థానిక సంఘ సేవకులు విన్నకోట సీతారామయ్య(నానాజీ) అన్నారు. నెలవారీ తనిఖీలలో భాగంగా గర్భిణీలు గురువారం ఆసుపత్రికి రాగా తనిఖీ అనంతరం వారికి ఉచితంగా భోజన వసతిని కల్పించడం జరిగింది. గత కొద్ది నెలలుగా విన్నకోట సీతారామయ్య తన సొంత నిధులు వెచ్చించి శ్రీ సాయి ప్రేమామృతం పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు పౌష్టికరమైన భోజనాన్ని వడ్డించారు. సకాలంలో తమకి భోజనం అందించినందుకు గర్భిణీలంతా ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోవైద్య సిబ్బంది, నార్ల మహంతి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జిఎస్టి-సేవింగ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-గజపతినగరం: సూపర్ జీఎస్టీ-సేవింగ్స్ పథకంపై గురువారం స్థానిక బిఎస్సార్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో బి.కళ్యాణి, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ప్రమీల గాంధీ హాజరై జిఎస్టి ప్రయోజనాలు, పన్ను పారదర్శకతపై అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డి సుగుణాకర్ రావు, జంట నగరాల ఈవో జి.జనార్ధన్ రావు, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ బెల్లాన లక్ష్మీ నరేన్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర-బొబ్బిలి : స్థానిక రాజా ఆర్‌యస్‌ఆర్‌కె రంగారావు కళాశాలలో జరుగుతున్న అంతరిక్ష వారోత్సవములలో రెండవ రోజు స్పేస్ టెక్నాలజీపై వివిధ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాజా కళాశాల జాయింట్ సెక్రటరీ రావు బదరీ, ప్రిన్సిపల్ సి.వీరేంద్ర కుమార్, ప్రపంచ అంతరిక్ష వారోత్సవ నిర్వాహక కమిటీ చైర్మన్ టి.హరి కృష్ణ, కార్యదర్శి ఈ.ప్రదీప్ నాయుడు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. అభ్యుదయ హై స్కూల్ విద్యార్థులు వై.ఆదిత్య కృష్ణ, బి.జ్యోత్స్న, కె.రోహిత్ కుమార్, కె.సిద్ధార్ధ చైతన్య, ఎస్.రంజిత్ కుమార్, వి.సాత్విక్, కె.లక్ష్య, ఎస్.జశ్వంత్, కె.శశాంక్ సాయి, బి.గణేష్‌లు ప్రథమస్థానం, ద్వితీయ స్థానం మక్కువ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.నారాయణరావు, కె.శిరీష, ఎల్.సౌమ్య సాయి, ఎం.రేష్మ శ్రీ, సిహెచ్.రాకేష్, బొబ్బిలి ఐరిష్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కి చెందిన డి.సంజన, ఆర్.ఉపేంద్ర, ఎం.గ్యాన్ దీప్, డి.వేద శ్రీ, జి.నవ్య, తృతీయ స్థానంలో కారాడ మహాత్మా గాంధీ జ్యోతిభా పూలే స్కూల్‌కు చెందిన వి.ప్రవీణ్, ఎన్.తేజేష్ కుమార్, ఎస్.గుణ శేఖర్, పి.భరత్ కుమార్, ఎం.యోగేశ్వరరావు, బొబ్బిలి శ్రీ చైతన్య స్కూల్‌కి చెందిన జి. జోసిత, ఎస్.చైత్ర హాసిని, ఎం.నితీష, జి.తన్మయి శ్రీ తదితరులు ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో రాజా కాలేజీ ప్రిన్సిపాల్ చల్లా వీరేంద్ర కుమార్, డాక్టర్ చోడిగంజి రవి తదితరులు పాల్గొన్నారు.

చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలో గర్భం మారుతి మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌లో రాజాం కృష్ణా హాస్పిటల్ డాక్టర్ పిఎల్ఎన్ రాజు (ఈఎన్టి స్పెషలిస్ట్)తో చెవి ముక్కు గొంతు గురించి అవగాహన సదస్సు జరిగింది. విజయనగరం గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ఐ గోపి, ప్రధాన కార్యదర్శి ఏఏఎన్ శర్మ పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి శర్మ మాట్లాడుతూ పరిధి దాటి వైద్యం చేయవద్దని క్వాలిఫైడ్ డాక్టర్లు అందరికీ విలువ గౌరవం ఇచ్చి వారి యొక్క సలహాలతో వృత్తిని కొనసాగించాలని అందరికీ తెలియజేశారు. ఇందులో మారుతి హాస్పిటల్ అధినేత ఆనంద్ మరియు సత్యనారాయణ,రమణ గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

వల్లంపూడి పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వల్లంపూడి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి పి.బాల భాస్కరరావు గురువారం సందర్శించి పాటశాల పరిసరాలు తరగతి గదులు,పాఠశాల ప్రార్థన పరిశీలించిన అనంతరం విద్యార్థులతో తెలుగు అభినయ గేయాలుపాడించడం,చదివించడం,ఇంగ్లీషు చదివించడం రాయించడం, చతుర్విధ ప్రక్రియలు చేయించడం, విద్యార్థుల వర్క్ బుక్స్ మొదలగునవి పరిశీలించారు. అంతరం పాఠశాలలో ఉన్న భవిత సెంటర్ లో విద్యార్థులు చేస్తున్న యాక్టివిటీస్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ ఎం టి లు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి

విశాలాంధ్ర - విజయనగరం: అర్జీదారుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన ఐవిఆర్ఎస్ కాల్స్ డేటాపై సమీక్షించారు. మ్యుటేషన్లకు సంబంధించి ఎక్కువగా అర్జీలు పెండింగ్లో ఉంటున్నాయని, దీనిపైనే ప్రధానంగా ఐవిఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ జరుగుతోందని చెప్పారు. పరిష్కారం అయ్యే సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం చేయలేనివాటికి సంబంధించి, అర్జీదారులకు ప్రభుత్వ నిబంధనలను వివరించాలని, ఏ కారణాలవల్ల వారి సమస్య పరిష్కారం కావడంలేదో సమగ్రంగా తెలియజేయాలని చెప్పారు.

అర్జీదారులకు సమగ్ర వివరాలతో నోటీసు అందించి, వారి సంతకం తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా మాట్లాడాలని సూచించారు. దీనికోసం రెవెన్యూ అధికారులు తమ దృక్పథాన్ని మార్చుకొని, సానుకూల దృష్టిని అలవర్చుకోవాలని డిఆర్ఓ కోరారు. ఈ సమావేశంలో కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి మురళి, సర్వేశాఖ ఇన్‌ఛార్జి ఏడి యజ్ఞేశ్వరరావు, ఆర్‌డిఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారి పండుగ విజయవంతం

జిల్లా ఎస్పీని కలిసి అభినందించిన కలిసిన పౌర వేదిక బృందం

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారి పండగను,విజయనగరం ఉత్సవాన్ని రెండు రోజుల పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ అధికారులు, వారి సిబ్బంది చక్కని ప్రణాళికలతో పండగని ఘనంగా నిర్వహించారని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. గురువారం పౌర వేదిక బృందం తో జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్‌ని కలిసి అభినందించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అమ్మవారి పండుగలో కీలకమైన సిరిమానోత్సవంలో ఉత్తరాంధ్ర ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారని పోలీసులు చాలా ఓపికగా తమ విధులు నిర్వహించారని ఎస్పీ ఏఆర్ దామోదర్ సమ న్వయం బాగుందని భీశెట్టి అన్నారు. పండుగ నిర్వహణలో కీలకమైన పాత్ర పోషించిన జిల్లా రెవెన్యూ అధికారి డి.ఆర్.ఓ శ్రీనివాసమూర్తిని కూడా పౌర వేదిక బృందం సత్కరించింది శ్రీనివాసమూర్తికి సింహాచలం ఉత్సవాలు నిర్వహించిన అనుభవంతో చక్కని రూపకల్పన చేసారని రెవెన్యూ అధికారులను సమన్వయం చెయ్యడంలో ఆయన విశేష కృషి చేశారని భీశెట్టి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పౌర వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్ర రాజు,తుమ్మగంటి రామ్మోహన్ రావు, అల్లంశెట్టి నాగభూషణం, మమ్ముల తిరుపతి రావు,జాగరపు ఈశ్వర ప్రసాద్,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీలలో ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్-కమ్-సేల్

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: అక్టోబర్ 10, 11 తేదీలలో విజయనగరంలోని మహారాజా గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డాన్స్ ప్రాంగణంలో ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్-కమ్-సేల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి తెలిపారు. సూపర్ జిఎస్టి - సూపర్ సేవింగ్ పథకంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న తగ్గిన పన్ను రేట్ల విధానం ద్వారా వినియోగదారులకు లాభం చేకూరుతుందని, ప్రదర్శనలో టెలివిజన్లు, ఎయిర్ కండిషనర్లు, డిష్‌వాషర్లు, స్మార్ట్ హోమ్ పరికరాలు, ఆరోగ్య పరికరాలు వంటి వస్తువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో వివిధ ఎలక్ట్రానిక్స్ డీలర్లు తమ తాజా ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, గృహోపకరణాలు, స్మార్ట్ హోమ్ సొల్యూషన్స్, ఆరోగ్య పరికరాలు మొదలైన వాటిని ప్రదర్శన, అమ్మకానికి ప్రదర్శిస్తారని వివరించారు. ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన తగ్గిన పన్ను రేట్ల విధానం కారణంగా వినియోగదారులకు తక్కువ ధరకే ఈ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయాని, ఈ ఎగ్జిబిషన్ ద్వారా ప్రజలు సాంకేతిక పరిజ్ఞానాన్ని దగ్గరగా తెలుసుకోవడంతో పాటు డిజిటల్ ఎంపవర్‌మెంట్ దిశగా ముందడుగు వేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమం కమర్షియల్ టాక్సెస్, ఇండస్ట్రీస్ కామర్స్, ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

సొంత ఆదాయ వనరుల సద్వినియోగంపై అవగాహన అవసరం

ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు

విశాలాంధ్ర - మెంటాడ: గ్రామ పంచాయితీల్లో సొంత ఆదాయ వనరులపై అవగాహన కలిగి ఉండాలని పంచాయితీలో గల వనరులతో వచ్చే ఆదాయంతో పంచాయతీని అభివృద్ధి చేసుకోగలమని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. గ్రామ పంచాయితీలలో సొంత ఆదాయ వనరుల వినియోగంపై రెండు రోజులపాటు శిక్షణ తరగతులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో భానుమూర్తి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. పంచాయితీలలో సొంత ఆదాయ వనరుల వినియోగం, ఆదాయ వనరులను తెచ్చి మార్గాలు, ఆర్థిక నిర్వహణలో పారదర్శకత, ప్రజా భాగస్వామ్యం వంటి అంశాలపై అధికారులచే అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భానుమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో విమల కుమారి మాట్లాడుతూ పంచాయతీల ఆర్థిక స్థితి బలోపేతం కావడానికి సొంత ఆదాయ వనరుల సద్వినియోగం అవసరమని తెలిపారు. గ్రామంలో గల అనేక రకాల వనరులను గుర్తించి వాటిని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి, ఏవిధంగా ఆదాయ మార్గంగా మార్చాలి, ఏ విధంగా పంచాయతీని అభివృద్ధి పరచాలి అనే దిశగా ఆలోచన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఎల్.ముత్యలునాయుడు, జి.కృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ముద్దు - జంక్ ఫుడ్ వద్దు

సీడీపీఓ ఉమా భారతి

విశాలాంధ్ర - గంట్యాడ: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని జంక్ ఫుడ్‌కి దూరంగా ఉండాలని సిడిపిఓ ఉమా భారతి తెలిపారు. గంట్యాడ ఐసిడిఎస్ పరిధిలో ఉన్న ఏఎంజి కాలనీ అంగన్వాడి కేంద్రంలో బుడతనపల్లి సెక్టార్ సూపర్వైజర్ అనురాధ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ ఉమా భారతి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. మనం తినే ప్రతిరోజు ఆహారంలో మునగాకును తీసుకోవడం అలవాటు చేసుకోవాలని మునగాకు తినడం వలన హిమోగ్లోబిన్ శాతం వలనపెరుగుతుందని అంతేకాకుండా ఎముకలు పటిష్టంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా నూనెతో చేసిన పదార్థాలకు దూరంగా ఉండాలని వాటిని తీసుకోవడం వల్ల ఊబకాయ్ వస్తుందన్నారు. ఊబకాయం రాకుండా ఉండాలంటే మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పల్లెల్లో దొరికే మునగాకు, బొప్పాయి, కరివేపాకు, రాగులు, గంటెలు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల నిమిత్తం జనసేన రూ.50 వేలు ఆర్థికసాయం

విశాలాంధ్ర - పూసపాటిరేగ: పూసపాటిరేగ మండలంలోని రెల్లివలస గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త నందిని ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందడంలో సవాళ్లు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక జనసేన నాయకులు ఆమెకు అండగా నిలబడి, తక్షణ చర్యలు చేపట్టారు. నందిని గతంలో జనసేన వాలంటీర్‌గా కృషి చేసినందున, ఆమెకు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కల్పించేలా పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.50,000 అందజేశారు.కార్యకర్తలకు కష్టకాలంలో అండగా నిలబడి సహాయం అందించడం ద్వారా స్థానిక నాయకులు తమ నిబద్ధతను, సేవా మనసును మరోసారి చాటారు. ఈ కార్యక్రమం నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదేశాలు పాటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఎక్కడ కష్టాల్లో ఉన్నా వారికి అండగా ఉండటం జనసేన లక్ష్యం అని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో బాల అప్పలరాజు, సర్పంచ్ కోట్ల రఘు మండల కోఆర్డినేటర్ గుడివాడ జమరాజు, ఏ.ఎం.సి ఉప చైర్మెన్ బాసి దుర్గ, వి.శ్రీను చల్లవానితోట, రౌతు ఉపేంద్ర, నక్కాన రమణ, కే. శ్రావణ్ కుమార్, గౌతమ్ రెడ్డి, వి. కిరణ్, ఎం. శ్రీను, ఎస్. రామచంద్ర పాల్గొన్నారు.

డాక్టర్ కరణం హరిబాబు సేవలు భేష్

విశాలాంధ్ర - రాజాం: స్థానిక సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరణం హరిబాబు అందిస్తున్న సేవలకు పలువురు స్వచ్ఛంద సంస్థలు అభినందనలు తెలియజేశాయి. పర్యావరణం, వికాస తరంగిణి, మానవత, రెడ్ క్రాస్, తూర్పు కాపు సంక్షేమ సంఘం వంటి సంఘాలు కలిసి డాక్టర్ హరిబాబు సేవలను ప్రశంసిస్తూ సన్మానించాయి. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ సాయి ప్రసంత్ కుమార్, వికాస తరంగిణి బుస్కి మాస్టర్, పర్యావరణ కన్వీనర్ ఆర్.వి.నాయుడు, పింకీ చైతన్య, నీలకంఠ యాదవ్, సత్యనారాయణ, వెంకటరావు, బాల మురళి తదితరులు పాల్గొన్నారు. సమాజానికి అంకితభావంతో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హరిబాబు కృషి భవిష్యత్తు తరాలకు ఆదర్శమన్నారు.

ఉపయోగపడే పనులను గుర్తించాలి

విశాలాంధ్ర - బాడంగి: ప్రజలకు రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని ఎంపీడీవో రామకృష్ణ కోరారు. మండల కేంద్రమైన బాడంగిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2026 - 2027 ఆర్థిక సంవత్సరానికి గాను సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటల పెంపకం, కంపోస్ట్ ఫిట్స్, చెరువుల బౌండరీతోపాటు ప్రజలకు కావలసిన వ్యక్తిగత పనులకు ముఖ్య ప్రాథమిక ఇవ్వాల్సిందిగా ఉపాధి పథకం అధికారులకు గ్రామ ప్రజలకు సూచించారు. గ్రామానికి కావలసిన పనులను ముందుగా గుర్తించి ప్రాధాన్యత క్రమంలో వాటిని పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, జడ్పిటిసి రామారావు, ఉపాధి హామీ పథకం ఏపీవో సాయిరాం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనుల పరిశీలన

విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలోని మెరకముడిదాం గ్రామంలో రూ.1.15 కోట్ల వ్యయంతో చేపట్టిన జల జీవన్ మిషన్ పనులను జిల్లా అధికారి బృందం గురువారం పరిశీలించారు. ఎన్.జె.జె.ఎం టీమ్ ఎంపిక చేసిన స్కీములపై నిర్వహించిన సంయుక్త తనిఖీలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కవిత ఆధ్వర్యంలో శివాలయం దగ్గర 120 కేఎల్ ఓహెచ్ఎస్ఆర్‌ని, రామమందిరం వీధిలోని కొళాయిలను పరిశీలించారు. ఈ పరిశీలనలో డీఈఈ శ్రీలత, ఎంపీడీవో జి.భాస్కరరావు, ఏఈ శివబాబు, ఈఓపీఆర్‌డి శ్రీరాములు నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

విశాలాంధ్ర - బాడంగి: మండలం బాడంగిలో విలేజ్ అగ్రికల్చర్ పంట కోత ప్రయోగాలపై గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ ఎం.మధుసూదన్ పంట కోత ప్రయోగాలలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మండల స్టాటిస్టికల్ ఆఫీసర్ రజనీ పంట కోత ప్రయోగాలు ఎలా చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ప్రతినిధి శ్రీమంతు, వ్యవసాయ అధికారి భాను ప్రకాష్, 14 రైతు సేవ కేంద్రాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లాలో అక్టోబర్ 11, 12 తేదీలలో జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించబడనున్నాయి. ఈ పోటీలను చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం, ఫైర్ చెస్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఓపెన్ కేటగిరీలో టాప్-10 స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు మొత్తం రూ.15,000/- నగదు బహుమతులు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అండర్-07, అండర్-09, అండర్-11, అండర్-13, అండర్-15 వయో వర్గాల్లో టాప్-3 విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేయబడతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వివరాలకు 74166 66567ను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

మెగా ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర-మెంటాడ: ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో చల్లపేట వైద్యశాల ఆధ్వర్యంలో ఇద్దనవలస గ్రామంలో గురువారం ఉచిత పశు గర్భకోసవ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారులు మాట్లాడుతూ ఈ శిబిరంలో మొత్తం 57 పశు వులకు గర్భ కోసం వ్యాధులు చికిత్సతోపాటు 46 పశువులకు సాధారణ వ్యాధుల చికిత్స అందించినట్లు తెలిపారు. మండలంలో వివిధ ప్రదేశాలలో నిర్వహిస్తున్న పశు వు ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్విని చేసుకోవాలని సూచించారు. అనంతరం పాడు రైతులకు మినరల్ మిక్చర్, లివర్ టానిక్స్, కాల్షియం టానిక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ మురళీకృష్ణ, విజయనగరం డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ దామోదర్, చల్లపేట వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్, పోరాం వైద్య అధికారులు డాక్టర్ బాల సందీప్, డాక్టర్ జగదీష్, ఇద్దన వలస గ్రామ సర్పంచ్ రాయిపల్లి రామారావు గ్రామ నాయకులు పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాకేరులో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు అప్పలనాయుడుల పర్యవేక్షణలో గ్రామంలోని పారిశుధ్య పనులు చేపట్టగా గ్రామంలోని కాలువల్లో పూడిక తీత పనులతోపాటు కాలువలలో తుప్పలు తొలగించడం చెత్త చెదారాలను వెలుపలికి తరలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు, ఆర్డబ్ల్యూఎస్ జేఈ వి.దేవి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్‌గా దేసరి మురళి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్‌గా నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన దేసరి మురళి నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు ఏపీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్ నవభరత్ ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్ చేతుల మీదుగా దేసరి మురళికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం, విజయనగరం జిల్లాలో ఎస్టీ వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. అలాగే రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా, వై.ఎస్. షర్మిలా రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి శ్రీనివాసరావు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సుంకర గణేష్ తదితరులు పాల్గొన్నారు.